వలస కుటుంబాలకు అండగా ఉంటాం

కలెక్టర్ వల్లూరు క్రాంతి

జిన్నారం: వలస కుటుంబాలతో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

జిన్నారం, సెప్టెంబర్ 4: ఖాజీపల్లిలో నివాసం ఉంటున్న వలస కుటుంబాలకు మౌలిక వసతులు కల్పించి అండగా ఉంటామని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. బుధవారం ఖాజీపల్లి గ్రామంలోని జీఎంఆర్ కాలనీలో పర్యటించి వలస కుటుంబాలతో సమావేశమయ్యారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో పాఠశాల నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీ పాఠశాలను తనిఖీ చేశారు. కాలనీలో తాగునీటికి చాలా ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వెంటనే నివారణకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వర్షాల కారణంగా వైరల్ ఫీవర్, సీజనల్ వ్యాధులు ప్రభలే అవకాశం ఉన్నందున్న అందరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అనంతరం జర్నలిస్ట్ కాలనీ లేఅవుట్‌ను పరిశీలించారు. జర్నలిస్ట్ కాలనీ మీదుగా కాల్వ ఉందని కొందరు కావాలని న్యూసెన్స్ చేస్తున్నారని తహసీల్దార్ కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. రికార్డుల్లో మాత్రం ఎలాంటి కాల్వ లేదని పేర్కొన్నారు. స్పందించిన కలెక్టర్ రికార్డుల్లో కాల్వ లేకుంటే పట్టించుకోవల్సిన అవసరం లేదని చెప్పారు. కలెక్టర్ వెంట డీఎంహెచ్‌వో గాయత్రీదేవి, తహసీల్దార్ భిక్షపతి, ఆర్ఐ జయప్రకాశ్ నారాయణ, సర్వేయర్ రామభద్ర, మాజీ సర్పంచ్ చిట్ల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలించాలి

బొల్లారం సెప్టెంబర్ 4: ప్రజల నుంచి వచ్చిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలో సుడిగాలి పర్యటన చేశారు. స్థానిక పీహెచ్‌సీని తనిఖీ చేసి వైద్య సేవలపై ఆరా తీశారు. డాక్టర్ నిర్మల రెడ్డి దవాఖానలో నెలకొన్న సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. అనంతరం బీఎల్‌వోలు చేపట్టిన ఓటరు జాబితా సర్వేను పరిశీలించారు. చెరువులు కుంటల పరిరక్షణలో భాగంగా మాధవానికుంటను తనిఖీ చేసి రక్షణ చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. అనంతరం తెలంగాణ ఆదర్శ పాఠశాలను తనిఖీ చేసి సీఎస్ఆర్ ఫండ్స్ కింద అవసరమైన మరమ్మతులు చేపట్టాలని, మౌలిక వసతుల కల్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో గాయత్రీదేవి, మున్సిపల్ చైర్‌పర్సన్ రోజా బాల్‌రెడ్డి, తహసీల్దార్ భిక్షపతి, కమిషనర్ మంగతాయారు తదితరులు పాల్గొన్నారు.

- ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు
- మంజీరాలోకి భారీగా వచ్చి చేరుతున్న వరద

వాన హోరు.. వరద జోరు

రాఘవపూర్ వద్ద మంజీలోకి భారీగా వస్తున్న వరద

మెటల్‌కుంట-బసంతపూర్ వద్ద బ్రిడ్జిపై ఉధృతంగా ప్రవహిస్తున్న వరద

న్యాల్‌కల్, సెప్టెంబర్ 4: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మూగజీవులు సైతం మేతకు అవస్థలు పడుతున్నాయి. కర్ణాటక ఎగవ ప్రాంతంతోపాటు మండలంలోని గ్రామాల్లో కురుస్తున్న వర్షాలతో హద్నూర్, డప్పూర్, శంశోల్లాపూర్, చినిగేపల్లి తదితర గ్రామాల్లోని వాగులు, కుంటలు, చెరువులతో పాటు మంజీరా నదిలోకి వరద నీరు భారీగా వచ్చి చేరుతున్నది. మండలం పరిధిలోని నారింజవాగు, మంజీరా నది తీరం పరిధిలోని కాకిజనవాడ, రాఘవపూర్, చీకూర్తి, హుస్సేన్‌నగర్, చాల్కి, అమీరాబాద్ తదితర గ్రామాల్లో సాగులో ఉన్న పంట పొలాల్లోకి సింగూర్ బ్యాక్ వాటర్ వస్తే పంటలు నీటిలో మునిగిపోయే ప్రమాదం ఉందని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మంజీరా నది పరీవాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు. భారీ వర్షాలతో పెసర, మినుము, సోయాబీన్, పత్తి తదితర పంటలు దెబ్బతిన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని మెటల్‌కుంట-బసంతపూర్ గ్రామ శివారులోని చాకిరివాగు, రేజింతల్-ఎల్గోయి గ్రామాల శివారులోని మామిడి వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఆయా గ్రామాల మీదుగా వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

కృష్ణాపూర్ పెద్ద చెరువు తూంకు మరమ్మతులు చేయాలి

తూంకు అడ్డంగా వేసిన మట్టి బస్తాలు

కల్హేర్, సెప్టెంబర్ 4: మండలంలోని కృష్ణాపూర్ పెద్దచెరువు చిన్న తూం లికేజీ కావడంతో రెండేళ్లుగా నీరు వృథాగా పోతున్నా పట్టించుకొనే నాథులే కరువయ్యారు. ఫిర్యాదు చేసినప్పుడల్లా తాత్కాలికంగా చర్యలు చేపట్టి చేతులు దులుపుకొంటున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఐదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి చెరువులోకి వరద నీరు వచ్చింది. వచ్చిన నీరు తూం ద్వారా వృథాగా పోతున్నది. దీంతో రైతులు, లష్కర్లు సిమెంట్ బస్తాలలో మట్టి నింపి తూంకు అడ్డంగా వేసి నీరు వెళ్లకుండా చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు గుర్తించి తూంకు మరమ్మతులు చేసి లీకేజీని అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

అలుగు పారుతున్న చెరువులు

అలుగు పారుతున్న ఊట్ల పెద్ద చెరువు

జిన్నారం, సెప్టెంబర్ 4: భారీ వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో చెరువులు, కుంటలు పొంగిపొర్లుతున్నాయి. జిన్నారంలోని అక్కమ్మ చెరువు రెండు రోజుల నుంచి అలుగు పారుతుండగా ఊట్ల గ్రామంలోని పెద్ద చెరువు బుధవారం ఉదయం నుంచి అలుగు పారుతోంది. చెరువు, కుంటలు నీటి పరవళ్లు తొక్కుతుండడంతో మత్స్యకారులు చేపల వేటతో సందడి చేస్తున్నారు.

121 మందికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు

నేడు కలెక్టరేట్‌లో ప్రదానోత్సవం

సంగారెడ్డి కలెక్టరేట్, సెప్టెంబర్ 4: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో మొత్తం 121 మంది ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారని జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు బుధవారం ప్రకటనలో తెలిపారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో గురువారం మధ్యాహ్నం 1.30 గంటలకు కలెక్టరేట్‌లో అవార్డుల ప్రదానోత్సవం ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, కలెక్టర్ వల్లూరు క్రాంతి చేతుల మీదుగా అవార్డుల ప్రదానోత్సవం ఉంటుందని తెలిపారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉపాధ్యాయులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

రామచంద్రాపురం, సెప్టెంబర్ 4: భెల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకం కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కవిత బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. భెల్‌లోని డిగ్రీ కళాశాలలో ఇంగ్లిష్ 2, తెలుగు 1, హిందీ 1, హిస్టరీ 1, కామర్స్ 1, మ్యాథ్స్ 1, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్ 1 సబ్జెక్టుల కోసం అతిథి అధ్యాపకులను ఆహ్వానిస్తున్నామని, కనీస అర్హత 55శాతం పీజీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం, పీహెచ్‌డీ ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 9వ తేదీ లోగా దరఖాస్తు సమర్పించాలని కోరారు.

నేడు, రేపు స్పాట్ అడ్మిషన్లు

మునిపల్లి, సెప్టెంబర్ 4: మండలంలోని బుదేరా చౌరస్తాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో సీట్ల భర్తీ కోసం ఈ నెల 5, 6 తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు చేపడుతున్నట్లు మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అర్చాన తెలిపారు. బుధేరా మహిళా డిగ్రీ కళాశాలల్లో బీకాం సీలో ఎస్సీలకు నాలుగు, ఎస్టీలకు ఒకటి, బీకాం జనరల్‌లో ఎస్సీలకు 14, బీకాం హానర్స్‌లో ఎస్సీలకు 22, ఎస్టీలకు ఒకటి, బీకాం బీఏలో ఎస్సీలకు 22, ఎస్టీలకు 1, బీకాం, బీబీఏలో ఎస్సీలకు 4, గ్రూపుల్లో మిగిలిన సీట్లను భర్తీ చేయడానికి స్పాట్ అడ్మిషన్లు చేపడుతున్నామని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థినులు పది, ఇంటర్ మెమోలతోపాటు కుల, ఆదాయ సరిఫికెట్లు, 5 నుంచి పదో తరగతి వరకు బోనఫైడ్, ఆధార్ కార్డ్, టీసీ, పది ఫొటోలతో హాజరుకావాలని సూచించారు.

నల్లవాగు గురుకులంలో..

సిర్గాపూర్, సెప్టెంబర్ 4: నల్లవాగు సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఈనెల 6వ తేదీన ఇంటర్ మొదటి సంవత్సరంలో స్పాట్ అడ్మిషన్స్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తిరుపతయ్య బుధవారం ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బీపీసీ గ్రూపుల్లో ఎస్సీ విద్యార్థులకు ఆరు సీట్లు, ఎస్టీలకు రెండు, బీసీలకు మూడు, మైనార్టీకి ఒకటి, ఓసీలకు ఒక సీటు చొప్పున సీట్లు ఖాళీగా ఉన్నాయని, వాటిని భర్తీ చేసేందుకు స్పాట్ అడ్మిషన్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 6వ తేదీన ఉదయం 11గంటలకు ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విధుల్లోకి తీసుకోవాలి

సిర్గాపూర్, సెప్టెంబర్ 4: రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ సాంఘిక సంక్షేమ గురుకులాల్లో పని చేస్తున్న గెస్ట్ టీచర్లను ప్రభుత్వం తొలిగించడం హేయమైన చర్య అని మండల మాజీ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సంజీవరావు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం సిర్గాపూర్‌లో వారు మాట్లాడుతూ కొన్నేండ్లుగా చాలీచాలని జీతాలతో కష్టపడి విధులు నిర్వహించారన్నారు. ఇది సరైన చర్య కాదని, ప్రభుత్వ నిరంకుశపాలనకు నిదర్శనమని పేర్కొన్నారు. సత్వరమే వీరిని విధుల్లోకి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

చట్ట విరుద్ధమైన కార్యక్రమాలు చేస్తే చర్యలు

రామచంద్రాపురం, సెప్టెంబర్ 4: భెల్ పరిసరాల్లో చట్టవిరుద్ధమైన కార్యక్రమాలు చేస్తే చర్యలు తప్పవని భెల్ అడ్మినిస్ట్రేషన్ ఏజీఎం సూరన్‌ప్రసాద్ హెచ్చరించారు. ఇటీవల భెల్‌లో సెక్యూరిటీ ఇన్‌చార్జి గణేశ్ నాయక్ తమ పట్ల దురుసుగా, అసభ్యకరంగా ప్రవర్తించాడని భారతీనగర్ డివిజన్ ఎల్ఐజీకి చెందిన శక్తిశ్రీనిధి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. దీంతో భెల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు స్పందించి శక్తిశ్రీనిధి, తన కజిన్ దినకర్ ఇద్దరు భెల్‌లో ఖాళీగా ఉన్న క్వార్టర్ 16 వద్ద బైక్‌ని నిలిపి రాత్రి సమయంలో క్వార్టర్‌లోనికి వెళ్లడంతోనే సెక్యూరిటీ ఇన్‌చార్జి గణేశ్ వారిని నిలదీయడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. భెల్ అడ్మినిస్ట్రేషన్ ఏజీఎం ప్రసాద్ ఫిర్యాదు మేరకు కూడా పోలీసులు శక్తిశ్రీనిధి, దినకర్‌పై కేసు నమోదు చేశారు. ఈ విషయంపై ఇన్‌స్పెక్టర్ జగన్నాథ్ వివరణ కోరగా ఇరువర్గాల నుంచి ఫిర్యాదులు రావడంతో కేసు నమోదు చేశామని, విచారణ తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కూలిన ఇండ్లను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే

నమ్లిమెట్‌లో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, సెప్టెంబర్ 4: వర్షం వల్ల నష్టపోయిన వారికి భరోసా కల్పించేందుకు బుధవారం నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి నియోజకవర్గంలో పర్యటించారు. నారాయణఖేడ్ మండలం నమ్లిమెట్ గ్రామంలో వర్షానికి కూలిన సాదుల వెంకటేశం, వడ్ల వీరయ్య ఇండ్లను పరిశీలించి బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పారు. ఇండ్లు కూలి నిరాశ్రయులైన బాధిత కుటుంబాలకు ప్రభుత్వం రూ.50 వేల చొప్పున తక్షణసాయంగా అందించడంతో పాటు ఇందిరమ్మ గృహం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు లక్ష్మారెడ్డి, లింగమేశ్, యాదయ్య, సాయిలు, నాగయ్య ఉన్నారు.

కంప్యూటర్ శిక్షణ ప్రారంభం

కంప్యూటర్ శిక్షణను ప్రారంభిస్తున్న నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి

నారాయణఖేడ్, సెప్టెంబర్ 4: పట్టణంలోని జడ్పీహెచ్ఎస్, బాలికల ఉన్నత పాఠశాలల్లో బ్రైట్‌చైల్డ్ సంస్థ సౌజన్యంతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవ్‌రెడ్డి ప్రారంభించారు. పేద విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ శిక్షణను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చిన బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ సంస్థను ఎమ్మెల్యే అభినందించారు. నారాయణఖేడ్ మండలంలోని అన్ని పాఠశాలల్లో కంప్యూటర్ శిక్షణ నిర్వహించేవిధంగా తోడ్పాటునందించాలని కోరారు. ప్రస్తుత ఆధునిక పరిస్థితుల్లో విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌స్వరూప్‌షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

గుమ్మడిదల: నల్లవల్లిలో పంటలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్

క్షేత్రస్థాయిలో పంటల పరిశీలన

గుమ్మడిదల, సెప్టెంబర్ 4: జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, శాస్త్రవేత్తల బృందం క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. బుధవారం మండలంలోని నల్లవల్లి గ్రామంలో మొక్కజొన్న, పత్తి, కంది పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. వర్షాలు తగ్గిన తర్వాత మాత్రమే ఎరువులు వాడాలని, పంట పొలాల్లో ఉన్న నీళ్లు బయటికి పోయే ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. అనంతరం గుమ్మడిదల రైతు వేదికలో రుణమాఫీ 2024కి సంబంధించి కుటుంబ సభ్యులు నిర్ధారణ కార్యక్రమంలో దరఖాస్తులు స్వీకరించే కార్యక్రమంలో పాల్గొన్నారు. శాస్త్రవేత్తలు నగేశ్, మల్లయ్య, ఏడీఏ మనోహర ఏఓ శ్రీనివాస రావు, ఏఈవోలు నిఖిత, సాయికిరణ్, రైతులు శ్రీశంకర్, వెంకటేశం పాల్గొన్నారు.

పంట నష్ట పరిహారం చెల్లించాలి

సదాశివపేట, సెప్టెంబర్ 4: భారీ వర్షాలతో నీట మునిగిన పంటలకు నష్ట పరిహారం చెల్లించాలని మంజీరా రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు పృథ్వీరాజ్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం పట్టణ శివారులో నీటి మునిగిన పత్తి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్ట వివరాలను ప్రభుత్వానికి నివేదించాలన్నారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.20 వేలు అందించాలన్నారు. కార్యక్రమంలో మంజీరా రైతు సమాఖ్య సభ్యులు నరసింహారావు, నారాయణరెడ్డి, రామిరెడ్డి, శ్రీనివాస్, మాణయ్య పాల్గొన్నారు.

పరిశ్రమల రసాయన వ్యర్థాలపై ఫిర్యాదు

జిన్నారం, సెప్టెంబర్ 4: గడ్డపోతారం పారిశ్రామికవాడలోని పలు రసాయన పరిశ్రమలు వర్షానికి సాకుగా చేసుకొని ఔట్ లెట్ల ద్వారా వ్యర్థాలను బయటకు వదులుతున్నాయి. రెండు రోజులుగా భారీగా కురిసిన వర్షాలకు పరిశ్రమల్లోని రసాయన వ్యర్థాలను ఔట్‌లెట్ల ద్వారా బయటకు వదులుతుండగా గ్రామస్తులు గుర్తించారు. పారిశ్రామికవాడలోని లీఫార్మా పరిశ్రమ పది ఔట్‌లెట్ల ద్వారా బుధవారం ఉదయం దొంగచాటుగా రసాయన వ్యర్థాలను వదులుతుండగా గ్రామస్తులు గుర్తించి పరిశ్రమ ప్రతినిధులను ప్రశ్నించారు. వీడియోలు, ఫొటోలు తీసి పీసీబీ ఈఈ కుమార్ పాఠక్‌కు వాట్సాప్‌లో ఫిర్యాదు చేశారు. పరిశ్రమను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని పీసీబీ ఈఈ కుమార్ పాఠక్ చెప్పిట్లు గ్రామస్తులు తెలిపారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు తరుచూ ఇదే జరుగుతోందని, లీఫార్మా పరిశ్రమపై పీసీబీ ఎంఎస్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసి నాలుగు రోజులు కూడా గడవకముందే మళ్లీ అదే తీరుగా వ్యవహరిస్తోందని, దీనిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు బాలయ్య, శ్రీనివాస్, సతయనారాయణ, నాగరాజు అధికారులను కోరారు.

విద్యారంగ పరిరక్షణకు పోరాడుదాం

సంగారెడ్డి, సెప్టెంబర్ 4: అందరికీ విద్య, ఉపాధి అవకాశాల సాధనకు దేశవ్యాప్తంగా ఐక్య ఉద్యమాలు చేసి విద్యారంగాన్ని కాపాడుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని ఎస్ఎఫ్ఐ ఉమ్మడి మెదక్ జిల్లా మాజీ అధ్యక్షుడు అతిమేల మాణిక్ అన్నారు. బుధవారం పట్టణంలోని కేవల్ కిషన్ భవన్‌లో ఎస్ఎఫ్ఐ జిల్లా విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులకు హాజరై మాట్లాడారు. విద్యకు కేంద్ర బడ్జెట్‌లో 10శాతం, రాష్ట్ర బడ్జెట్‌లో 30శాతం నిధులు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మహిళా కన్వీనర్ వాణి, జిల్లా ఉపాధ్యక్షుడు హరీశ్, సభ్యులు విష్ణు వర్ధన్, అర్జున్, స్వప్న, ప్రశాంత్, పావని పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేతకు పరామర్శ

జిన్నారం, సెప్టెంబర్ 4: జిన్నారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు బొంతపల్లి బ్రహ్మేందర్‌గౌడ్ తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ బుధవారం జిన్నారంలోని ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బీఆర్ఎస్ జిల్లా నాయకుడు వెంకటేశంగౌడ్, మండల అధ్యక్షుడు రాజేశ్, రామకృష్ణ ఉన్నారు.

రోడ్డును బాగుచేయండి సారూ..

ఆర్‌అండ్‌బీ అధికారులకు వినతిపత్రం ఇచ్చిన ఇరిగిపల్లి గ్రామస్తులు

సంగారెడ్డి, సెప్టెంబర్ 4: వానకాలంలో రోడ్డు వడవలేని స్థితిలో ఉందని పలుమార్లు జిల్లా అధికారులకు గ్రామస్థులు వినతులు ఇచ్చినా స్పందనలేదని, సంబంధితశాఖ అధికారులకు ఇరిగిపల్లి వాసులు వినతిపత్రం అందజేశారు. బుధవారం పట్టణంలోని ఆర్ అండ్‌బీ కార్యాలయంలో ఈఈ, డిప్యూటీ ఈలకు ఇరిగిపల్లి రోడ్డు బాగుచేయాలని కోరుతూ వినతిపత్రాలు అందజేశారు. వర్షాలంలో గ్రామానికి ద్విచక్ర వాహనాలు మినహా ఇతర వాహనాల రవాణాకు రోడ్డు సౌకర్యంగా లేవని చెప్పారు. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు వచ్చే బస్సులు నడవలేని పరిస్థితిని ఎదుర్కొంటున్నాయని, రోడ్డుపై ప్రయాణం చేస్తే ప్రమాదాలకు గురి అవుతున్నాయని అధికారులకు తెలిపారు. రోడ్డుకు మరమ్మతులు చేయాలని గ్రామస్తులు అధికారులను వేడుకున్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

దవాఖాన సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సంగారెడ్డి, సెప్టెంబర్ 4: జిల్లా కేంద్ర ప్రభుత్వ దవాఖానకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూపరింటెండెంట్ అనిల్‌కు ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి అధ్యక్షుడు శ్రీధర్ మహేంద్ర వినతిపత్రం అందజేశారు. బుధవారం జిల్లా దవాఖానలో సూపరింటెండెంట్‌ను కలిసి సీజనల్ వ్యాధులపై వచ్చే రోగులకు మెరుగైన చికిత్స అందించాలని కోరారు. ఈ సందర్భంగా శ్రీధర్ మహేంద్ర మాట్లాడుతూ సంగారెడ్డి దవాఖాన మెడికల్ కాలేజీగా మారడంతో రోగుల సంఖ్య పెరిగిందన్నారు. వైద్యులు, మందుల కొరత లేకుండా చూడాలని, దివ్యంగులు, వృద్ధులకు ప్రత్యేక ఓపీ ఏర్పాటు చేయాలని కోరారు. రోగులకు మెనూ ప్రకారం అల్పాహారం, తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. అంబులెన్సుల దోపిడీని అరికట్టి, అత్యవసర సేవల విభాగంలో బెడ్ల సంఖ్య పెంచాలన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఫోరమ్ ఫర్ బెటర్ సహ కార్యదర్శి శ్రీకాంత్, సభ్యులు సాయి వరాల, రాజు ఉన్నారు.

ఉత్తమ అధ్యాపకుల అవార్డుకు ఎంపిక

డాక్టర్ జగదీశ్వర్

మిథున్ రాథోడ్

డాక్టర్ మల్లిక

సంగారెడ్డి కలెక్టరేట్, సెప్టెంబర్ 4: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వం ప్రకటించిన ఉత్తమ అధ్యాపకుల జాబితాలో తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ముగ్గురు అధ్యాపకులకు చోటు దక్కింది. బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్ వారిని అభినందించారు. రాష్ట్ర స్థాయి ఉత్తమ అధ్యాపకులుగా ఎంపికైన వారిలో కళాశాల అర్థశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ జగదీశ్వర్, ప్రభుత్వ పాలన అధ్యాపకురాలు డాక్టర్ మల్లిక, జీవశాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ మిథున్ రాథోడ్ ఉన్నారని వివరించారు. బోధనా ప్రక్రియలో నూతన విధానాలను అనుసరించడం, వివిధ అంశాలపై ప్రత్యేక ఆర్టికల్స్ ప్రచురించడం, కళాశాలలో హరిత హారం, స్వచ్ఛభారత్, గ్రీన్ కళాశాల ఏర్పాటు, వినూత్న పద్ధతుల ద్వారా బోధించడం, సామాజిక కార్యక్రమాల్లో భాగంగా అందించిన సేవలకు వీరికి ఉత్తమ అధ్యాపక అవార్డులు దక్కాయని వెల్లడించారు. గురువారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమంలో అవార్డులు అందుకుంటారని తెలిపారు.

డీఎస్పీకి మట్టి విగ్రహం అందజేత

డీఎస్పీకి మట్టిగణపతిని అందజేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ యూత్ సభ్యులు

సంగారెడ్డి, సెప్టెంబర్ 4: వినాయక చవితికి మట్టి గణపతులను పూజించాలని డీఎస్పీ సత్తయ్యగౌడ్ కోరారు. బుధవారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో హెల్పింగ్ హ్యాండ్స్ యూత్ సభ్యులు మట్టి వినాయకుడిని డీఎస్పీకి అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రజలు శాంతియుతంగా గణేశ్ ఉత్సవాలను జరుపుకోవాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మండపాల వద్ద తప్పనిసరిగా ఇద్దరు చొప్పున ఉండాలన్నారు. డీఎస్పీని కలిసిన వారిలో శివకుమార్ ఉన్నారు.

తప్పుడు ప్రచారాలు చేస్తే కఠిన చర్యలు

వట్‌పల్లి, సెప్టెంబర్ 4: సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేసి ప్రజలను భయాందోళనకు గురిచేస్తే చర్యలు తప్పవని ఎస్సై లక్ష్మణ్ హెచ్చరించారు. మండల పరిధిలోని గౌతపూర్ గ్రామ శివారులోని హంస చెరువును మంగళవారం సాయంత్రం ఎస్సై పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గౌతపూర్ హంస చెరువు కట్ట తెగిపోయి, పంటలు నీట మునిగి, గ్రామం ప్రమాద స్థాయిలో ఉందని సోషల్ మీడియాలో ప్రచారం కావడంతో చెరువును పరిశీలించినట్లు తెలిపారు. చెరువు కట్ట తెగిపోలేదని, సాధారణ వర్షపు నీరే ఉందని, తప్పుడు ప్రచారాలతో అధికారుల సమయం వృథా చేయొద్దని హెచ్చరించారు. తప్పుడు పోస్టులు చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యార్థులకు అండగా కేరింగ్ హ్యాండ్స్

రామచంద్రాపురం, సెప్టెంబర్ 4: టీఎస్ మోడల్ స్కూల్ విద్యార్థులకు కేరింగ్ హ్యాండ్స్ ఎన్‌జీవో సంస్థ అండగా నిలుస్తున్నదని ప్రిన్సిపాల్ రాంప్రసాద్ అన్నారు. వెలిమెలలోని మోడల్ స్కూల్‌కి కేరింగ్ హ్యాండ్స్ ఎన్‌జీవో సంస్థ విద్యార్థులకు క్రీడా సామగ్రి, పోటీ పరీక్షల పుస్తకాలు, నిఘంటువులను అందజేసిందని తెలిపారు. సంస్థ ప్రతినిధులు అజిత్, రాజ్‌కుమార్‌లు మోడల్ స్కూల్‌ని సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు తమ ఎన్‌జీవో ద్వారా కావాల్సిన సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు.

దూరిపోతున్నారు!

మునిపల్లి, సెప్టెంబర్ 4: మండలంలోని లింగంపల్లి గురుకుల పాఠశాలలో సౌకర్యలు కల్పించడంలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో విద్యార్థులు ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారు. లింగంపల్లి గురుకుల హాస్టల్ వసత